జులై 4న అల్లూరి జయంతోత్సవాలు

విశాలాంధ్ర - గొలుగొండ: స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతిని వచ్చేనెల 4వ తేదీన కృష్ణదేవిపేట అల్లూరి స్మారక పార్కులో నిర్వహించనున్నట్లు అల్లూరి యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు పడాల వీరభద్రరావు తెలిపారు. పార్కులో ఉన్న ఆడిటోరియంలో అల్లూరి చరిత్రకు సంబంధించిన 30 విలువైన ఫోటోలు శాశ్వతంగా అల్లూరి సంఘం సొంత నిధులతో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అనుమతుల కోసం సిఫారసు చేయాలని హోం మంత్రి వంగలపూడి అనితను కోరడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అల్లూరి యువజన సంఘం మహిళా అధ్యక్షురాలు శ్యామల వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ పోస్టును దక్కించుకునే పనిలో పూర్వపు డీటీ



- పరవాడ బదిలీకి ముమ్మర ప్రయత్నాలు
- ప్రజా ప్రతినిధుల చుట్టూ ఆ అధికారి ప్రదక్షిణలు
- వద్దు బాబోయ్ అంటున్న మండల ప్రజలు

విశాలాంధ్ర - పరవాడ: రాష్ట్రంలో వివిధ ప్రదేశాల్లో పనిచేసే ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన అధికారులు సొంత ప్రదేశానికి వచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. రాష్ట్రంలోనే ఉమ్మడి విశాఖ జిల్లా ప్రశాంతమైందని, సేఫెస్ట్ జోన్ అని పేరుంది. అందులోను ఇదే ఉమ్మడి జిల్లాలో పరవాడ మండలం ఇంకా ప్రశాంతమైనది కావడంతో ఈ మండలానికి బదిలీలపై రావడానికి ఎక్కువగా ఇష్టపడుతుంటారు. ఈ మేరకు పోస్టులు దక్కించుకునేందుకు తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఇతర శాఖల్లో ఉన్న అధికారులు ఎలా ఉన్నప్పటికీ రెవెన్యూ కార్యాల యంలో తహశీల్దార్ పోస్టు దక్కించుకునేందుకు ఓ అధికారి తన ప్రయత్నాలు ముమ్మరం చేశారు. గతంలో పరవాడలో డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేసిన ఆ అధికారి గతేడాదిలో నర్సీపట్నం డివిజన్ మండలానికి బదిలీ అయ్యారు. అక్కడే పనిచేస్తూ కొన్నాళ్లకు తహశీల్దార్‌గా పదోన్నతి పొందారు. ఇటీవల సాధారణ ఎన్నికల్లో భాగంగా అక్కడ నుంచి ఆయన విజయనగరం జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో తిరిగి సొంత జిల్లాకు వచ్చేయనున్న క్రమంలో పరవాడ తహశీల్దార్ పోస్టును దక్కించుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఈ మేరకు ప్రజా ప్రతినిధులను ప్రసన్నం చేసుకున్నారన్న వదంతులు వెలువడుతున్నాయి. పైగా ఆ ప్రజా ప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలను తీసుకునే ప్రయత్నంలో ఉన్నారు. అయితే నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేలు, ఎంపీల లెటర్ ప్యాడ్స్ ఇంకా సిద్ధం కాకపోవడంతో వారి నుంచి హామీ తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. అదే నిజమైతే మండల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత తప్పదు. పరవాడలో డిప్యూటీ తహశీల్దారుగా పనిచేసిన సమయంలో ఆ అధికారిపై తీవ్ర అవినీతి ఆరోపణలు ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ పార్టీ నేతలు అతన్ని డిప్యూటీ తహశీల్దారుగా ఇక్కడకు తెచ్చుకున్నారు. అప్పటి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సిఫార్సుతో పరవాడకు చెందిన ఓ నాయకుడు ఇక్కడకు రప్పించుకున్నారు. అప్పటి నుంచి ఈ మండలంలో నాలుగేళ్లకు పైగా డిప్యూటీ తహశీల్దారుగా పనిచేశారు. ఆ కాల వ్యవధిలో కార్యాలయం మొత్తం ఇతని ఆధీనంలోనే ఉండేది. పైగా తహశీల్దారు ఉన్నప్పటికీ ఇతనికి తెలియకుండా ఏ ఫైల్ కూడా కదిలేది కాదు. ఇతన్ని సంప్రదించిన తర్వాతే ఏ పనైనా జరిగేది. కార్యాలయ సేవల కన్నా బయట సెటిల్‌మెంట్లపైనే ఎక్కువ దృష్టి సారించేవారన్న విమర్శలూ ఇతనిపై లేకపోలేదు. సామాన్యులను ఇబ్బందులు పెడుతూ నేరుగా కాకుండా దళారుల ద్వారానే పనులు చేసేవారని ఇతనిపై ఆరోపణలు ఉన్నాయి. కొందరు రియల్ వ్యాపారులు, దళారులు అప్పట్లో ఊటగెడ్డ సమీపంలోని ఓ ప్రైవేట్ లే అవుట్‌లో ఇతనికి ఫ్లాట్ కూడా ఏర్పాటు చేశారు. కార్యాలయంలో కాకుండా ఆ ఫ్లాట్‌లోనే ఫైళ్లు సంతకాలు వగైరా పనులు చేసేవారు. అంతే కాదు అడ్డదారుల్లో క్వారీ ఎన్‌వోసీలు మంజూరు చేసి భారీగానే లబ్ధిపొందారని విమర్శలు ఉన్నాయి. పెదముషిడివాడ ల్యాండ్ పూలింగ్‌లోనూ జరిగిన అక్రమాలకు ఆజ్యం పోసింది కూడా ఈ అధికారేనని ఆ గ్రామస్తులు బహిరంగంగానే చెబుతున్నారు. అప్పటి తహశీల్దారుతో పాటు బదిలీ అయిన ఆర్ఐ సత్తిబాబుతో కలిసి ల్యాండ్ పూలింగ్‌లో సంబంధంలేని వ్యక్తులను అనుభవంలో ఉన్నట్లు లబ్ధిదారుల జాబితాలో చేర్చారని ఆ గ్రామస్తులు చెబుతున్నారు. ఇందుకు గాను డీటీ, తహశీల్దారులు బినామీ పేర్లతో కొంత స్థలాన్ని గిఫ్టుగా పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాగే పట్టాదారు పాసుపుస్తకాలు, భూముల ఆన్‌లైన్ విషయంలోనూ ఈ అధికారి చాలా ఇబ్బందులు పెట్టేవారని మండల రైతులు ఆవేదన వ్యక్తం చేసేవారు. అయితే ఆయనే తిరిగి మండల తహశీల్దారుగా వచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారన్న వార్త వినగానే మండల ప్రజల్లో తీవ్ర ఆందోళన మొదలైంది. పెండింగ్‌లో ఉన్న ఫైళ్లు, లావాదేవీలు పూర్తి చేసుకోవడానికే వస్తున్నారని ఆరోపిస్తున్నారు. వైసీపీకి తొత్తుగా వ్యవహరించిన ఆ అధికారిని ఇక్కడకు రాకుండా చూడాలని కొత్తగా ఎన్నికైన ఎంపీ, ఎమ్మెల్యేలను మండల ప్రజలు కోరుతున్నారు.

ఆర్.ఈ.సి.స్ పాలిటెక్నిక్‌లో అడ్మిషన్లు

విశాలాంధ్ర - కశింకోట: స్థానిక రాజీవ్ గాంధీ ఆర్.ఈ.సి.స్ పాలిటెక్నిక్‌లో 50 శాతం అడ్మిషన్లకు దరఖాస్తులు సోమవారం నుండి ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ కె.శివ తెలిపారు. ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్‌లో అడ్మిషన్ కావలసినవారు దరఖాస్తు తీసుకుని దాన్ని పూరించి కాలేజీలో సబ్మిట్ చేయాలని తెలియజేశారు. కళాశాలలో 4 బ్రాంచిలు, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్ ఉన్నాయని, ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గణేష్, ఆఫీస్ సుపెరింటెంట్ కె.శివరాం, సీనియర్ అసిస్టెంట్ కె.శ్రీలక్ష్మి పాల్గొన్నారు. వివరాలకు 9063297220, 08924 220377, 9505504220ను సంప్రదించాలని తెలిపారు.

ఎమ్మెల్యే విజయ్ కుమార్‌ను కలిసిన గ్రంథాలయాధికారులు

విశాలాంధ్ర - అచ్యుతాపురం: యలమంచిలి నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్‌ను నియోజవర్గంలోని గ్రంథాలయాధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే సుందరపు నివాసంలో గ్రంథాలయాధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో వి.ఆనంద్ (ఎలమంచిలి), ఎల్‌వి రమణ (మునగపాక), డి.కోటేశ్వరరావు (అచ్యుతాపురం), ఎస్.శకు ంతలా దేవి (రాంబిల్లి) తదితరులు ఉన్నారు.

కుళాయిలు పనులు ప్రారంభం

విశాలాంధ్ర - గొలుగొండ: మండలంలో పాత మల్లంపేట పంచాయతీ పరిధిలో గల బుడ్డదుపాడు గ్రామంలో జల జీవన్ ద్వారా చేపట్టే ఇంటింటి కుళాయి పనులను సర్పంచ్ గెడ్డం ఆదిలక్ష్మి, ఆనంద్ కొబ్బరికాయలు కొట్టి సోమవారం పనులు ప్రారంభించారు. జల్ జీవన్ మిషన్ ద్వారా చేపట్ట బోయే ఇంటింటి కుళాయిలకు 12 లక్షల 80000 రూపాయలు నిధులు మంజూరు కావడంతో ఈ పనులు చేపట్టినట్లు సర్పంచ్ గెడ్డం ఆదిలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు గెడ్డం నానాజీ, మజ్జిగ సోములు, రుత్తల సత్యనారాయణ, ప్రసాదు, వార్డ్ మెంబర్ సిగ్గే రాము, బుడ్డదుపాడు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో గుడివాడ గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేసి కళ్ల అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దూళి శ్రీనుబాబు, వైసీపీ నాయకులు శ్రీపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ స్కూల్ వసతి గృహాల సిబ్బందిని క్రమబద్ధీరించాలి

విశాలాంధ్ర - కశింకోట: రాష్ట్రవ్యాప్తంగా 134 ఆదర్శ పాఠశాలల వసతి గృహాల్లో పనిచేసే వార్డెన్, హెడ్ కూక్, అసిస్టెంట్ కుక్, వాచ్‌మెన్ అప్కాస్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని, రోజువారీ వేతనంతో పని చేస్తున్న సిబ్బందిని కాంట్రాక్ట్‌లోకి మార్పు చేసి మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేసి వేతనాలు పెంపుదల చేయాలని ఏఐటీయూసీ రాష్ట్రసమితి సభ్యులు కోన లక్ష్మణ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. దాదాపు 1500 మంది రోజువారీ వేతనంతో పని చేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అనేక సంవత్సరాల నుండి పనిచేస్తున్న వీరిని తొలగించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వం వీరి సమస్యలు అనేక సార్లు విన్నవించినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వీరికి వచ్చే వేతనాల వల్ల కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. టీడీపీ ప్రభుత్వం వేతనాలు పెంపుదల చేసి ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలని హాస్టల్‌లో సిబ్బంది సంఖ్యను పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని మినిమం టైం స్కేల్ వర్తింపచేయాలని కోరారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన ఏఐటీయూసీ నేతలు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే మిడ్ డే మీల్ వర్కర్స్, స్కావెంజర్స్, మోడల్ స్కూల్ హాస్టల్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కార్యాలయంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం.రమేష్ బాబు ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించినట్లు ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు కోన లక్ష్మణ తెలిపారు. సమస్యల పట్ల సాను కూలంగా స్పందించిన మంత్రి లోకేష్ పరిష్కరిస్తామన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

విశాలాంధ్ర - కశింకోట: తన భర్త డ్యూటీకి వెళ్లి తిరిగి రాలేదని కశింకోట పోలీస్ స్టేషన్‌లో భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. పోలీసులు అందించిన వివరాలు ప్రకారం.. కశింకోట మండలంలోని బంగారయ్య పేటకు చెందిన ఆండ్ర పద్మావతి తన భర్త ఆండ్ర శ్రీనివాస్ అచ్యుతాపురం వసూద ఫార్మా కంపెనీ లో పనిచేస్తున్నారని, ప్రతిరోజు బంగారయ్యపేట గ్రామం నుండి తన ద్విచక్ర వాహనంపై యలమంచలి వెళ్లి ఎలమంచిలో బండి పార్క్ చేసుకుని కంపెనీ బస్సులో అచ్యుతాపురం తన కంపెనీకి వెళ్లి డ్యూటీ ముగించుకున్న తర్వాత కంపెనీ బస్సు యలమంచిలి వచ్చి మరల అదే బైక్ పై తిరిగి ఇంటికి వస్తుండేవారన్నారు. 13వ తేదీన ఉదయం నాలుగు గంటలకు డ్యూటీకి వెళ్లి తిరిగి సాయంత్రం 5 గంటల కు కంపెనీ నుండి బయటకు వచ్చి కంపెనీ బస్సు ఎక్కినట్లు తన భర్త తర్వాత ఇంటికి రాలేనట్లు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు, ఎస్సై రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా బక్రీద్ పర్వదిన వేడుకలు

విశాలాంధ్ర - పరవాడ: మండలంలో బక్రీద్ పర్వదిన వేడుకలు ముస్లిం పెద్దలు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా జరిగాయి. పరవాడ, ఎన్టీపీసీ, వాడచీపురుపల్లి, గొల్లగుంట తదితర గ్రామాల్లో బక్రీద్ పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం ఆయా చోట్ల ఊరేగింపుగా మసీదులు, ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గొల్లగుంట మసీదులో పెద్దలు, మతగురువులు ప్రత్యేక ప్రార్థనల అనంతరం ధార్మికోపన్యాసం చేశారు. దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ బక్రీద్ పండుగను జరుపుకుంటున్నారన్నారు. త్యాగ నిరతికి బక్రీద్ పండగ నిదర్శనమని అన్నారు. ధనిక, పేద అన్న తారతమ్యం లేకుండా రాగద్వేషాలకు అతీతంగా మైనారిటీలందరూ భక్తిశ్రద్ధలతో ఈ పండగను జరుపుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ దాన గుణం, సేవాగుణం అలవర్చుకోవాలని చెప్పారు. పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు ఒకరిని నొకరూ ఆలింగనం చేసుకుని ఈద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

యలమంచిలి: బక్రీదు పండగను పురస్కరించుకొని సోమవారం ముస్లిం సోదరులంతా బస్టాండ్ సమీపంలో గల కుల పెద్దల సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలతో కుర్బానీ పండగ చేసుకున్నారు. ఈ కుర్బానీని మూడవ భాగాలుగా ఒక భాగం తమకు, ఒక భాగం స్నేహితులకు, ఒక భాగం పేదవారికి ఇచ్చి ఈ కుర్బానీ పండగను తమ ఆచారంగా చేసుకుంటా మన్నారు. అందరూ సుఖంగా ఉండాలని ప్రత్యేక ప్రార్థన చేయించారు.



టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లాకు నేతల స్వాగతం



విశాలాంధ్ర - కశింకోట: ఆంధ్రప్రదేశ్ టీడీపీ అధ్యక్షులుగా నియమించ బడి విజయవాడ నుంచి విశాఖపట్నం వచ్చిన పల్లా శ్రీనివాస రావుకి విమానాశ్రయంలో మాజీ శాసనమండ సభ్యులు బుద్ధ నాగ జగదీష్, మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ, బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ళ సురేంద్ర, అనకాపల్లి పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు డాక్టర్ కేకేవి నారాయణరావు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ అధ్య క్షులు బత్తుల తాతయ్య బాబు, రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ పాల్గొన్నారు.

తుమ్మపాల షుగర్స్ కార్మికులను ఆదుకోవాలి



విశాలాంధ్ర - కశింకోట: తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీ దినసరి వేతన కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కార్మిక సంఘం నాయకులు గొర్లి శ్రీనివాసరావు, ఆకుల శ్రీనివాసరావు కోరారు. సోమవారం ఫ్యాక్టరీ ఆవరణలో కార్మికులతో జరిగిన సమావే శంలో వారు మాట్లాడారు. తొలుత కూటమి నాయకుల చిత్రపటాలకు పాలాభిషేకాన్ని చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం దినసరి వేతన కార్మికులను చిన్నచూపు చూసిందన్నారు. ఫ్యాక్టరీని అర్థాంతరంగా మూసేయడంతో పాటు దినసరి వేతన కార్మికులకు రావలసిన బెనిఫిట్స్‌లో అందించలేదన్నారు. దీంతో పెద్ద సంఖ్యలో కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయి అన్నారు. పలువురు మనోవేదనతో ప్రాణాలు సైతం విడిచారు అన్నారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ఫ్యాక్టరీ పునరుద్ధరణపై దృష్టిసారించి ఆధునీకరణ చేసి కార్మికులను రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

యాదాద్రి కాలువను పరిశీలించిన ఎమ్మెల్యే సుందరపు

విశాలాంధ్ర - యలమంచిలి: యలమంచిలి పట్టణంలో వర్షాకాలంలో యాదాద్రి కాలువ సమస్యతో వరదనీటితో తరచూ ముంపునకు గురి కావడంతో ప్రధాన సమస్యగా పట్టిపీడిస్తున్న ఈ యాదాద్రి కాలువను ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ఎమ్మెల్యేగా ఎంపికైన మొట్టమొద టిసారిగా సోమవారం పరిశీలించారు. 2 కిలోమీటర్లు దూరం యలమంచిలి పట్టణంలో ప్రవహిస్తున్న ఈ కాలువ అంతా కాలినడకన ఎమ్మెల్యే సుందర్ విజయకుమార్, మున్సిపల్ అధికారులతో కలసి పరిశీలించారు. తాను రాజకీయాల్లోకి వచ్చిన 15 సంవత్సరాల నుండి ఈ కాలువతో ప్రజలు వర్షాకాలంలో ఎదుర్కొంటున్న సమస్యలు తనను కలచివేసాయని, అందుకే ఎమ్మెల్యే అయిన వెంటనే దీనినే పరిశీలిం చడానికి నిర్ణయించుకోవడం జరిగిందని, వీలైనంత త్వరలో కాలువలో పూడికతీత అవసరమైన చోట వెడల్పు చేయటం ద్వారా ఈ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ సుబ్బారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, జనసేన, టీడీపీ నాయకులు బొద్దపు శ్రీను, ఆడారి ఆదిమూర్తి, ఆడారి రమణబాబు, అచ్యుతాపురం జనసేన నాయకుడు సూరకాసుల బాబ్జి, కొట్టారు సాంబ, విట్టా శ్రీను, లవుదు లోవరాజు, అన్నం బాబ్జి, పల్లా సత్యనారాయణ, కొలగాన భాస్కర్, లాలం సోమనాయుడు, కరణం రవి, బొద్దపు నాగేశ్వరరావు, బోద్దపు రమణ, గుర్రాల రామ్ లక్ష్మణ్, చిట్టిబాబు, గంధం శివ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విజయరామరాజుపేట బ్రిడ్జిని పరిశీలించిన అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం నియోజకవర్గం, బుచ్చయ్యపేట మండలం విజయ రామరాజు పేట వద్ద తాచేరు నదిపై బి.ఎన్.రోడ్లో కూలిన ప్రధాన వంతెనను అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, స్థానిక ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజుతో కలసి సోమవారం పరిశీలించారు. గత ప్రభుత్వ హయాంలో కూలిపోయిన బ్రిడ్జి నేటికి అదే పరిస్థితిలో ఉండి పనులు ప్రారంభించిక పోవడం దురదృష్టకరం అని, నిత్యం వందల మంది ప్రయాణించే రోడ్లను, బ్రిడ్జ్ మరమ్మతులను చూసుకోవాల్సిన పూర్తి బాధ్యత పాలకులు మీద ఉంటుంది అన్నారు. బ్రిడ్జి పక్కన ఉన్నటువంటి తాత్కాలిక రోడ్డు (డైవర్షన్)ని గురించి అధికారులును అడిగి తెలుసుకున్నారు. శాశ్వత ప్రతిపాదికన కొత్త నిర్మాణం పూర్తి చేయుటకు దాదాపు 6 కోట్ల రూపాయల వ్యయం వరకు అవుతుందని అధికారులు తెలియజేశారు. కొత్త బ్రిడ్జి నిర్మాణం కొరకు తీసుకోవాల్సిన చర్యలు, పూర్తి నివేదికను అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు బత్తుల తాతబాబు, జనసేన పార్టీ చోడవరం నియోజవర్గ ఇన్చార్జి పీవీఎస్ఎన్ రాజు, కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అల్లూరి చిత్రపటాలు అమర్చేందుకు అయ్యన్న అనుమతి

విశాలాంధ్ర - గొలుగొండ: రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జరిపే స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి జులై 4న అల్లూరి 127వ జయంతోత్సవాలు కృష్ణదేవిపేట అల్లూరి స్మారక పార్కులో ఘనంగా జరపాలని నిర్ణయించినట్లు జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు తెలియ జేశారు. అల్లూరి చరిత్రకు సంబంధించిన ఎంతో విలువైన 30 చిత్రపటాలను అల్లూరి సంఘం సొంత నిధులతో పార్కులోని ఆడిటోరియంలో శాశ్వతంగా అమర్చాలని జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం నిర్ణయించిందని అందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి నివ్వాలని, ఆ మేరకు అనుమతిని ఇప్పించవలసిందిగా నర్సీపట్నం ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్న పాత్రుడును కోరడం జరిగిందని, దీనిపై స్పందించిన అయ్యన్నపాత్రుడు కలెక్టర్, ఆర్డిఓతో మాట్లాడతానని చెప్పారన్నారు. చిత్రపటాలను ఆడిటోరి యంలో మీరు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. చిత్రపటాల ఆవిష్కరణ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి తమ చేతులతో ఆవిష్కరించ వలసిందిగా పడాల వీరభద్రరావు కోరగా తప్పనిసరిగా వచ్చి ఆవిష్కరిస్తానని అయ్యన్న అన్నారని చెప్పారు. పార్కులో త్రాగునీటి ఇబ్బంది, సమాధులపై ఉన్న పై స్లాబు తదితర వాటిని మైనర్ రిపేర్లు చేయవలసి ఉందని పడాల వీరభద్ర రావు అయ్యన్నపాత్రుడు దృష్టికి తీసుకువెళ్లగా ఎంపీ నిధులతో పార్కు అభివృద్ధికి రూ.30 లక్షలు విడుదల చేయాలని కోరగా ఆయన అంగీకరించారని, త్వరలో 30 లక్షల రూపాయలు విడుదల చేసి పార్కు అభివృద్ధికి ఖర్చు చేయడం జరుగుతుందని అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో నర్సీపట్నం నియోజకవర్గంలో పోటీచేసిన కూటమి తెలుగుదేశం అభ్యర్థి అయ్యన్నపాత్రుడుకు జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం మద్దతు తెలిపిందని, ఆయన విజయం సాధించినందుకు పడాల వీరభద్రరావు అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం కార్యదర్శులు శివంగి నాగేశ్వరరావు, శ్యామల వరలక్ష్మి, లక్కాకుల బాబ్జి, అంబటి వరహాల రాజు, విశాఖ జిల్లా అల్లూరి గాం గంటం దొర, మల్లు దొరల సేవా సంఘం ఉపాధ్యక్షులు పోతిన వెంకటేశ్వరరావు, లీగల్ అడ్వైజర్ కంతంరెడ్డి శివశంకర్, కార్యదర్శి కంబాల శంకర్రావు, కార్యవర్గ సభ్యులు ఎన్.టి.వర్మ, పి.శరత్, జి.చిట్టిబాబు, శివంగి ప్రియ వర్షి, బత్రి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు బ్రేక్... అందని వేట నిషేధ భృతి

ఆకలితో అలమటిస్తున్న మత్స్యకారులు

విశాలాంధ్ర - అచ్యుతాపురం: రెక్కాడితే గాని డొక్కాడని దుస్థితిలో మత్స్యకారులు బతుకులీడిస్తున్నారు. చేపల వేట నిషేధంతో తీరంలో మత్స్యకారుల పడవలు (తెప్పలు) అన్ని ఒడ్డునే ఉన్నాయి. చేపల వేటకు బ్రేక్ ముగిసిన మత్స్యకారులకు వేట నిషేధ భృతి అందలేదు. తినడానికి తిండి లేక, కుటుంబాన్ని పోషించుకోలేక ఆకలితో అలమటిస్తూ, అప్పులు చేసి జీవనం సాగిస్తున్నారు. తెల్లవారుజామునే చీకటిలో అలలను చీల్చు కుంటూ ప్రాణాలు ఫణంగా పెట్టి సముద్రంలోకి వెళ్లి చేపల వేట సాగించే మత్స్యకారుల బాధలను పట్టించుకునే నాధుడే లేడు. మత్స్యకారులకు చేపల వేట తప్ప వేరే జీవనాధారం ఏమి లేదు. చేపల వేట నిషేధంతో మత్స్యకారులతో పాటు వారి కుటుంబాలు, చేపల విక్రయాలపై ఆధార పడిన కుటుంబాలు జీవనం కష్టంగా మారిందని వాపోతున్నారు. చేపల వేట నిషేధించి 61 రోజులు కావస్తున్న వేట నిషేధ భృతి అందక పోవడంతో పూడిమడక మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని పెద్ద మత్స్యకార గ్రామమైన పూడిమడకలో 3000 కుటుంబాలు సముద్రపు వేటపైన ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వారికి చేపల వేట తప్ప వేరే జీవనాధారం ఏమీ లేదు. ప్రభుత్వం ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు 61 రోజులు పాటు మత్స్యకారులు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లకుండా నిషేధం విధించింది. చేపల వేట నిషేధ సమయంలో ప్రభుత్వం ప్రతి మత్స్యకారునికి 10000 రూపాయలు వేట నిషేధ భృతి అందిస్తుంది.

ప్రభుత్వం చేపల వేట నిషేధించి కొన్ని రోజులు కావస్తున్న నేటికీ వేట నిషేధ భృతి అందలేదు. మత్స్యకారులకు వేరే జీవనోపాధి లేక దుర్భర జీవనం గడుపుతున్నారు. గంగపుత్రులను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు సర్వత్ర వినిపిస్తున్నాయి. ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు మత్స్యకారుల ఓట్ల కోసం మత్స్యకారుల బ్రతుకులు మారుస్తామని చెప్పడమే తప్ప పట్టించుకునే నాథుడే కరువయ్యారని గంగపుత్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.